రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## రోడ్డు ప్రమాదంపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

**-ప్రమాదంపై ఆరా..**

**-కలెక్టర్ ఎస్పీలతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్య అధించాలని ఆదేశం**

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
వికారాబాద్ జిల్లా దారూర్ మండలంలోని కేరెళ్లి-బాచారం వద్ద ఆటోను లారీ ఢీకోన్న సంఘటనలో నలుగురి మృతి పట్ల విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ప్రమాద విషయం తెలిసిన వెంటనే వికారాబాద్ జిల్లా కలెక్టర్ నిఖిల ,ఎస్పీ కోటిరెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.పెద్దేముల్ మండలం మదనంతాపూర్ తండాకు చెందిన వ్యక్తులు ఆటోలో వెళ్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడిక్కడే ముగ్గురు ప్రాణాలు కోల్పోగా మరోకరు ఆస్పత్రిలో మృతి చెందగా పలువురు గాయపడటం బాధాకరమని అన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని మంత్రి కోరుకున్నారు.మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు

**- షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ శ్రీశైలం యాదవ్ వెల్లడి**

**షాద్‌నగర్, నవంబర్ 3, (ప్రభాతవార్త) :**
షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ పరిధిలో నెలకొన్న డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులు పరిష్కారానికై షాద్‌నగర్‌లో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేస్తున్నామని షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీశైలం యాదవ్ తెలిపారు. గురువారం ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... నేటి నుంచి 12వ తేది వరకు ట్రాఫిక్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ద్వార డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన కేసులు ఎన్నో పరిష్కారామవుతాయని ఆయన తెలిపారు. కేసుల పరిష్కారానికై షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన వివరించారు. ఈ ప్రత్యేక లోక్‌అదాలత్‌లో ఎలాంటి కోర్టులు, జైలు జరిమానాలు లేకుండా కేసులు సత్వరమే పరిష్కారం అవుతాయని సీఐ తెలిపారు.

# దళితబంధుతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

**-రాష్ట్ర షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్**
**-సమావేశంలో పాల్గొన్న దళితబంధు అభివృద్ధి సలహాదారు లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ హరీశ్**


మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన దళితబంధు లబ్దిదారుల, అధికారుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్, పాల్గొన్న దళితబంధు అభివృద్ధి సలహాదారు లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ హరీశ్,జిల్లా అదనపు కలెక్టర్ జాన్‌శ్యాంసన్, పలువురు అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 3, ప్రభాతవార్త**
దళితబంధును వినియోగించుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్ పేర్కొన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డ్‌కులాల సేవాసహకార అభివృద్ధి సంఘం, దళితబంధు వ్యవసాయ-అనుబంధ శాఖల అధికారులు, లబ్దిదారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో ఆయనతో పాటు దళితబంధు ప్రత్యేక అధికారి డాక్టర్ లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ హరీశ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగ పాల్గొన్న రాష్ట్ర షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆర్థికంగ ఎదగాలన్న లక్ష్యంతో దళితబంధును ప్రవేశపెట్టిందని అన్నారు. అర్హులైన వారికి 10లక్షల రూపాయల చొప్పున అందజేయటం జరుగుతుందన్నారు. వారి కోరిన మేరకు వాహనాలు, ట్రాక్టర్లు, జెసిబిలు, హార్వెస్టర్లు వంటి వాటిని కూడ అందించటం జరిగిందన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండ ఈ పథకం విజయవంతంగ సాగుతుందన్నారు. జిల్లా అధికారులతో పాటు అందరి సహకారం ఉంటుందన్నారు. ఒకే గ్రామంలో ఒకే రకం వాహనాలు కాకుండ వివిధ రకాల వ్యాపారాలు చేసినట్లైతే మరింత అభివృద్ధి చెందుతారన్నారు. జిల్లా స్థాయి అధికారుల సూచనలు,సలహాలు తీసుకోవాలన్నారు. దళితబంధు కింద లబ్ధిపొందిన వారిని చైతన్యపర్చటానికి సలహాలు అందించేందుకు ఎపుడూ అందుబాటులో ఉంటామన్నారు. ఈ విషయంలో బ్యాంకర్లు కూడ సహకరిస్తున్నారన్నారు. ప్రభుత్వ దళితబంధు పథకం సలహాదారు డాక్టర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సిఎం కెసిఆర్ దళితులు పేద,బడుగు,బలహీనవర్గాల పక్షపాతి అని వారి అభ్యున్నతి కోసం దళితబంధును ప్రవేశపెట్టారన్నారు. దళితులు ఆర్థికంగ సామాజికంగ వెనకబడి ఉన్నారని వారిని అన్ని రంగాల్లో రాణించేందుకు దళితబంధును అందిస్తున్నారన్నారు. అన్ని జిల్లాల్లోనూ ఈ పథకం విజయవంతంగ కొనసాగుతుందన్నారు. అధికారులు అర్హులైన వారికి అన్ని విధాల చేయూత నిస్తారని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్ దూరదృష్టితో దళితులు ఆర్థికంగ, సామాజికంగ ఎదగాలన్న ఉద్దేశ్యంతో దళితబంధును తెచ్చారన్నారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగ దళితబంధు పథకం కింద ఇప్పటి వరకు 563మంది అర్హులైన లబ్దిదారులకు ఈ పథకం అందించినట్లు తెలిపారు. దళితబంధును పొందిన యువత సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగ ఎదిగి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. జిల్లా అధికారులు దళితబంధు లబ్దిదారులకు మార్గదర్శకాలు అందిస్తారని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న డిక్కి సంస్థ ద్వారా వ్యవసాయరంగంలో, వ్యవసాయంతో పాటు పెంపకం,ఉద్యానవనం, డెయిరీ, కోళ్లపెంపకంతో పాటు చిరుదాన్యాలు, పలు రంగాల వారిపై పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ చసి దళితబంధు పథకం అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ జాన్‌శ్యాంసన్, జిల్లా షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధి అధికారి బాలాజీ, లీడ్‌బ్యాంకు మేనేజర్ కిషోర్, జిల్లా డిఆర్‌డిఓ పద్మజారాణి, జడ్పీ సిఇఓ దేవసహాయం, ఆర్డీఓ మల్లయ్య, డిక్కి సంస్థ నుంచి అరుణ్, ప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు, జిల్లాలోని లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## పంటలను కాపాడుకోవడానికి తగిన చర్యలు చేపట్టాలి

**- మండల వ్యవసాయాధికారి నిశాంత్ కుమార్**


పత్తి పంటలను పరిశీలిస్తున్న అధికారి నిశాంత్‌కుమార్, తదితరులు

**షాద్‌నగర్, నవంబర్ 3, (ప్రభాతవార్త) :** పత్తి పంటల్లో చీడపీడలను గుర్తించి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని, పంటలను కాపాడుకోవాలని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్ రైతులకు సూచించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం రాసుమల్లగూడ గ్రామ సర్పంచి దొడ్డి మాధవి రంగయ్యతో కలిసి గ్రామంలో రైతులు వేసిన పత్తి పంటలను ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పత్తి పంటలకు అధికంగా తెల్లదోమ, తామర పురుగు, చీడపీడలు వస్తాయని వాటిని త్వరగా గుర్తించి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. పంటలను కాపాడుకోవడానికి రైతులు చేపట్టావల్సిన తగు సూచనలు, సలహాలు రైతులకు తెలిపారు. అదేవిధంగా గ్రామానికి చెందిన ఎత్తినే సుగుణమ్మకు చెందిన పత్తి పంటను పరిశీలించి ఆమెకు చీడపీడ నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు తేజ్‌కుమార్, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల్లో సభ్యత్వం కల్పించాలని ముదిరాజ్‌ల నిరసన

**-కాలుష్యం, కోర్టు కేసు ఉన్నా చేపల పంపిణీపై అభ్యంతరం**


ఎదులాబాద్ లక్ష్మీనారాయణచెరువు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ముదిరాజ్ మత్స్యకారులు (జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమతో వాగ్వివాదం)

**ఘట్‌కేసర్, నవంబర్ 3, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణచెరువులో గురువారం చేపపిల్లలు పంపిణీ చేయడంపై ముదిరాజ్ మత్స్యకారులు అభ్యంతరం తెలిపారు. మేడ్చల్ జిల్లా మత్స్యశాఖ అధికారిణి పూర్ణిమ ఆశాఖ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, గంగపుత్ర సంఘం సభ్యులతో కలిసి చెరువులో చేపపిల్లలను వదిలారు. కాగా 778 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న లక్ష్మీనారాయణచెరువులో 293 మంది సభ్యులు ఉండగా జీఓ.6 ప్రకారం ఎకరానికి ఒకరి చొప్పున అధికారులు మత్స్యపారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వం కల్పించాలని ముదిరాజ్ మత్స్యకారులు గత కొన్ని సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నారు. దీనిపై గంగపుత్రులు 2015లో చెరువులో కాలుష్యం కారణంగా చేపలు చనిపోతున్నాయని ప్రభుత్వం చెరువులో చేపల పంపిణీ చేయకూడదని కోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు తెచ్చారు. దీంతో ముదిరాజ్ కుటుంబాలు తమకు చెరువులో సభ్యత్వం ఇవ్వాలని మత్స్యశాఖ కమీషనర్, జిల్లా మత్స్యశాఖ అధికారి, జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేసి కోర్టులో కేసు వేశారు. అయితే కోర్టు కేసు, కాలుష్యం ఉందంటూ మత్స్యశాఖ అధికారులు తమకు చెరువు సంఘంలో సభ్యత్వం ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఇప్పుడు మాత్రం చేపపిల్లలను నీటిలో వదిలారని ముదిరాజ్‌లు చెరువుకట్లపై నిరసన వ్యక్తం చేశారు. జలకాలుష్యం ఉన్నప్పటికి చేపపిల్లలను ఎందుకు వేశారని వారు జిల్లా అధికారి పూర్ణిమను నిలదీశారు. ఇకనైనా తమను నిర్లక్ష్యం చేయకుండా మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో ముదిరాజ్‌లకు సభ్యత్వం ఇచ్చి జీవనోపాధి కల్పించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## పాఠశాలల గదుల నిర్మాణానికి శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

**శంకర్‌పల్లి, నవంబర్ 3, ప్రభాతవార్త :**
పాఠశాలల గదుల నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. గురువారం శంకర్‌పల్లి జిల్లా పారిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారం రూ.50లక్షలతో 6పాఠశాలల గదులను మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మిప్రవీణ్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, జడ్పీటీసీ గోవిందమ్మగోపాల్‌రెడ్డి, సొసైటి చైర్మెన్ బధ్ధం శశిదర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ బి.వెంకట్‌రాంరెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ డి.వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్వేత పాండురంగారెడ్డి, చంద్రమౌళి, సిహెచ్.ఆశోక్, లక్ష్మమ్మరాంరెడ్డి, కోఆప్షన్ సభ్యులు రజినిశ్రీనివాస్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు ఏనుగు నర్సింహ్మారెడ్డి, మండల టీఆర్ఎస్ అధ్యక్షులు కె.గోపాల్, మహారాజ్‌పేట్ సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, మహాలింగపురం ఎంపీటీసీ యాదగిరి, శంకర్‌పల్లి మున్సిపల్ టీఆర్ఎస్ అధ్యక్షులు వాసుదేవ్‌కన్న, మండల టీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ టీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు జె.పాండురంగారెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు

**ఘట్‌కేసర్, నవంబర్ 3, ప్రభాతవార్త:**
కరెంట్ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని టిఎస్ఎస్‌పిడిసిఎల్ ఏడిఈ కెపి. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి ఘట్‌కేసర్ సబ్‌డివిజన్ పరిధిలో 19 వినతి పత్రాలను స్వీకరించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిలర్లు మేకల పద్మారావు, బేతాల నర్సింగ్‌రావు, కుతాడి రవీందర్‌తో పాటు పలువురు నాయకులు, వినియోగదారులు పలు సమస్యలపై అధికారులతో చర్చించారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లకు మరమ్మతులు, కరెంట్ స్తంభాల ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కరెంట్ సమస్యలపై ఫిర్యాదు చేస్తే సిబ్బంది సక్రమంగా స్పందించడం లేదని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసదస్సులో ఏఇలు జి.సతీష్‌కుమార్, ప్రదీప్‌కుమార్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఘట్‌కేసర్, నారపల్లి, పీర్జాదీగూడ ఉపకేంద్రాల పరిధిలోని విని యోగదారులు హజరై సదస్సులో సమస్యలు తెలి యజేయాలని అధికారులు కోరగా సరైన స్పందన రాకపోవడం గమనార్హం.

# మదనంతాపూర్, రెగొండి గ్రామాలలో అలముకున్న విషాదఛాయలు


నుజ్జు నుజ్జైన ఆటో

**పెద్దేముల్, నవంబరు 3, ప్రభాతవార్త:**
వికారాబాద్ జిల్లా కెరెళ్ళి-బాచారం ప్రధానమార్గం మలుపు వద్ద ఆటోను ఢీకొన్న ఘటనలో నలుగురు మృత్యువాత పడగ, పలువురు తీవ్రంగా గాయపడిన సంఘటనతో జిల్లా ప్రజలు ఉలిక్కి పడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..పెద్దేముల్ మండలం మదనంతాపూర్ గ్రామానికి చెందిన హెమ్లానాయక్ ( 52),వర్ష్యారవి (48),నెనావత్ కిషన్ (40)తో పాటు సోనిబాయి, నెనావత్ వినోద్, నెనావత్ చందు, నెల్లిగడ్డతాండాకు చెందిన సుమిత్రబాయి, రెగొండి గ్రామానికి చెందిన రమేష్‌లు అదే గ్రామానికి చెందిన జమాల్(38) ఆటోలో గురువారం ఉదయం 7-00 గంటల ప్రాంతంలో వికారాబాద్‌లో అడ్డ కూలీలుగా పనిచేసేందుకు వెళ్ళారు. ప్రతి నిత్యం అడ్డకూలీలుగా పనిచేసేందుకు వెళుతున్న ఈ క్రమంలో వికారాబాద్ నుంచి వస్తున్న లారీ కెరెళ్ళి-బాచారం మలుపు వద్ద ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న మదనంతాపూర్ గ్రామానికి చెందిన హెమ్లానాయక్, వర్ష్యారవి, నెనావత్ కిషన్, రెగొండి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జమాల్ అక్కడిక్కడే మృతి చెందారు. సోనిబాయి, నెనావత్ వినోద్, నెనావత్ చందు, సుమిత్రాబాయిలకు తీవ్ర గాయాలు కావడంతో వారిని హైద్రాబాద్‌లోని నీమ్స్ ఆసుపత్రికి తరలించారు. రెగొండి గ్రామానికి చెందిన రమేష్, బాచారం గ్రామానికి చెందిన వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రతి రోజు ఉదయాన్నె కూలీ పనులకు వెళుతు కుటుంబాన్ని పోషించుకునే వారు విగతా జీవులుగా మారడంతో వారి కుటుంబాలు శోకసముద్రంలో మునిగి పోయాయి, మదనంతాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. మదనంతాపూర్ గ్రామానికి చెందిన హెమ్లా నాయక్ తాపి మేస్త్రిగా పని చేస్తు కుటుంబాన్ని పోషించుకునే వారు. ఆయనకు భార్య రత్నబాయి, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్ళు ఉన్నారు. ఇద్దరి ఆడపిల్లల్ల పెళ్ళిల్లు చేశారు. నెనావత్ కిషన్‌కు భార్య లక్ష్మిబాయి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు కాగా ఓ కొడుకు, బిడ్డ పెళ్ళిల్లు చేశారు. వర్ష్యా రవికి భార్య సోనుబాయి, ఇద్దరు కూతుళ్ళు, ఒక కుమారుడు ఉండగా వారు చదువుతున్నారు. రెగొండి గ్రామానికి చెందిన జమాల్ ప్రతినిత్యం ఆటోలో కూలీలను తీసుకెళుతు వారిని అడ్డమీద దింపి, అతడు వికారాబాద్ సమీపంలో ఉన్న క్రషర్ మిషన్ వద్ద టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తు తిరిగి కూలీలను తీసుకొచ్చేవారు. జమాల్‌కు భార్య షాజహాన్ బేగం, 9 సంవత్సరాల కొడుకు సోహన్, 5 సంవత్సరాల కూతురు సుమయ ఫాతిమ మంబాపూర్ పాఠశాలలో చదువుతున్నారు. అయితే జమాల్ తండ్రి మైనొద్దిన్ కూడా అదే క్రషర్ మిషన్‌లో పనిచేస్తు రొడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కుటుంబ పెద్దగా ఉన్న జమాల్ ఆటోను నడుపుతు కుటుంబాన్ని పోషిస్తు రొడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. హృదయ విచారకరమైన సంఘటనను చూస్తు ప్రతి ఒక్కరు కంటతడి పెట్టారు. తీవ్ర గాయాలపాలైన బాధితులను నీమ్స్ ఆసుపత్రిలో మాజీ మంత్రి, ఎంఎల్‌సి మహేందర్‌రెడ్డి పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశించారు.

# టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు,పెన్షనర్స్‌కు బెనిఫిట్స్ మంజూరు చేయాలి

**-ఎపిలో ఇస్తున్నారు.. తెలంగాణకు ఇవ్వాలి..**
**-తెలంగాణ 398స్పెషల్ టీచర్స్,పెన్షనర్స్ అసోసిషియేషన్ డిమాండ్**
**-జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డికి వినతి**


మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా అదనపు కలెక్టర నర్సింహ్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసిన తెలంగాణ 398స్పెషల్ టీచర్స్,పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 3, ప్రభాతవార్త**
ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన సమావేశంలో సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ 398స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్స్,పెన్షన్స్ బెనిఫిట్స్‌లను మంజూరు చేయాలని తెలంగాణ 398స్పెషల్ టీచర్లు,అసోసిషియేషన్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డిని కలిసి వారు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగ 398స్పెషల్ టీచర్స్‌అండ్ అసోసిషియేషన్ సభ్యులు మాట్లాడుతూ 398స్పెషల్ టీచర్ల సేవాకాలానికి నోషనల్ ఇంక్రిమెంట్స్,పెన్షన్స్, బెనిఫిట్స్‌ను ఇవ్వాలని గత కొన్ని సంవత్సరాల నుంచి కోరటం, ఉపాధ్యాయ సంఘాలు కూడ డిమాండ్ చేస్తూనే ఉన్నట్లు వివరించారు. అయితే సిఎం కెసిఆర్ బాధ్యతలు చేపట్టిన తరువాత కూడ 398స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్స్, పెన్షనర్స్‌కు బెనిఫిట్స్ ఇస్తామని కూడ 2018సంవత్సరంలో ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమావేశంలో సిఎం హామీ ఇచ్చారని అన్నారు. ఆ తరువాత నియమించబడిన అప్రెంటీస్ టీచర్లకు స్పెషల్ విద్యావలంటీర్లకు నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇచ్చారని అన్నారు. కానీ 398స్పెషల్ టీచర్లకు ఆ జీవో నోచుకోవటం లేదన్నారు. ఇంక్రిమెంట్స్ ఇస్తామని హామీ ఇచ్చిన అమలుకు నోషనల్ సేవాకాలానికి ఎపి ప్రభుత్వం నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇస్తే తెలంగాణ ప్రభుత్వం ఇవ్వటం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక లబ్ధి పొందకపోవటమే కాక, తీవ్రంగ నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే న్యాయం చేయాలని, తెలంగాణ వ్యాప్తంగ ఉన్న 398 స్పెషల్ టీచర్లకు,పెన్షనర్స్‌కు బెనిఫిట్స్ అందించాలని సిఎం కెసిఆర్‌ను కోరుతున్నట్లు ఆ టీచర్స్ అసోసిషియేషన్ సభ్యులు నర్సింగ్‌రావు, సత్యనారాయణ, నర్సింహ్మారెడ్డి, తదితరులు కోరారు.

## మా గ్రామాన్ని నూతన గ్రామపంచాయతీ చేయండి



**బషీరాబాద్,నవంబర్ 3,ప్రభాతవార్త:**
మా గ్రామాన్ని నూతన గ్రామపంచాయతీ చేయాలంటూ గురువారం నాడు బషీరాబాద్ తహసిల్దార్ వెంకట స్వామికి మల్కాన్ గిరి గ్రామ స్తులు వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశీంపూర్ అనుబంధ గ్రామంగా ఉండటంతో ఆ గ్రామ సర్పంచ్ మల్కాన్ గిరిలో అభివృద్ధి పనులు ఎమి చేయటం లేదన్నారు.ఈ సందర్భంగా తమ గ్రామాన్ని ప్రత్యక జిపి ఏర్పాటు కోసం ఎనిమిది రోజుల పాటు రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు, యువ కులు పేర్కొన్నారు.ఎనిమిది రోజుల పాటు నిర్వహించే నిరాహార దీక్షకు అనుమతులు ఇవ్వాలంటూ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో, ఎంపిడివో కార్యాలయంలో వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగేష్,బాలకృష్ణ,కుర్వ మల్లప్ప, రవీంధర్, శ్రీనివాస్,అనంతయ్య,కుర్వ నర్సప్ప, మాల ఎల్లేశం, శేఖర్, రామ కృష్ణ,మధు, గోపాల్, రాజు తదితరులు ఉన్నారు.

## సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ సభ్యురాలిగా హైమారెడ్డి నియామకం

**-ఉత్తర్వులు జారీ చేసిన హైదరాబాద్ రీజినల్ ఆఫీసర్**

**శామీర్‌పేట, నవంబరు 3, ప్రభాతవార్త**
సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అడ్వయిజరీ సభ్యురాలుగా మేడ్చల్ జిల్లా రూరల్ బిజెపి కార్యదర్శి ఎన్.హైమారెడ్డి (హకీంపేట్-సింగాయిపల్లి) నియమితులయ్యారు. కేంద్ర మంత్రిత్వశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు హైదరాబాద్ రీజనల్ ఆఫీసర్ పేర్కొన్నారు. రెండు సంవత్సరాల పాటు మెంబర్‌గా ఆమె కొనసాగనున్నారు. జిల్లా నుంచి తనకు సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అడ్వయిజరీ సభ్యురాలుగా నియామకంకు అవకాశం కల్పించిన, సహకరించిన రాష్ట్ర బిజెపి అధ్యక్షులు,ఎంపి బండి సంజయ్‌కు, జాతీయ, రాష్ట్ర పార్టీ నాయకులకు ఎన్.హైమారెడ్డి దన్యవాదాలు తెలియజేశారు. అయితే బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ రాష్ట్రంలో నిర్వహించిన పాద యాత్రలో నిరవధికంగ ఆమె పాల్గొనటం జరిగిన సంగతి తెలిసిందే. దీంతోనే బిజెపి పార్టీ గుర్తించినట్లు చెప్పవచ్చు. గత అక్టోబరు 28న ఆమె నియమితులైనట్లు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు.


మేడ్చల్ జిల్లా రూరల్ బిజెపి కార్యదర్శి ఎన్.హైమారెడ్డి సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ సభ్యురాలుగా నియమితులై రాష్ట్ర బిజెపి అధ్యక్షులు బండి సంజయ్‌ను కలిసిన దృశ్యం

## రైతు గర్జనను విజయవంతం చేయాలి

**-13న పేరెడ్ గ్రౌండ్స్‌లో బికెఎస్ ఆధ్వర్యంలో రైతు గర్జనసభ**
**-శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో జరిగిన బైక్ ర్యాలీ ..పోస్టర్ ఆవిష్కరణ**


శామీర్‌పేట పెద్ద చెరువుకట్ట మైసమ్మ ఆలయం వద్ద రైతుగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించిన భారత కిసాన్ సంఘ్ జిల్లా, మండల నాయకులు

**శామీర్‌పేట, నవంబరు 3, ప్రభాతవార్త**
భారత కిసాన్ సంఘ్ రైతు గర్జన మహాసభ ఈ నెల 13వ తేదీన సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతుందని రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ శామీర్‌పేట, మూడుచింతలపల్లి రెండు మండలాల్లో బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం శామీర్‌పేట పెద్ద చెరువు కట్ట మైసమ్మ ఆలయం వద్ద రైతుగర్జన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆ తరువాత బైక్‌ర్యాలీని ప్రారంభించారు. మేడ్చల్ జిల్లా బికెఎస్ అధ్యక్షులు కె.రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ కార్యక్రమం జరిగింది. దీనిలో రాష్ట్ర కార్యదర్శి బౌరంపేట మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వెంకట్‌రెడ్డిలు జిల్లా అధ్యక్షులు రాజేందర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొని శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల తహసీల్దార్‌లకు వినతిపత్రంలను అందజేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతుగర్జన మహాసభ జరుగుతుందన్నారు. లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని, 24గంటలు నిరవధికంగ విద్యుత్ సరఫరా చేయాలని, వరి ధాన్యంను కొనుగోలు చేయాలని, కేంద్రాలు పెంచాలని, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతుగర్జన మహాసభ జరుగుతుందని రైతులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె.సురేందర్‌రెడ్డి, ప్రచార ప్రముఖ్ శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, పోచంరెడ్డి, సంజీవరెడ్డి, బల్వంతరెడ్డి, నారాయణరెడ్డి, వర్మ, గోవర్ధన్‌రెడ్డి,రాంరెడ్డి, నర్సింహ్మారెడ్డి, నాగిరెడ్డి,దేవేందర్‌రెడ్డి, నందు, నరసింహ,నాగేశ్,హరిమోహన్‌రెడ్డి, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు, సీఐ



పరామర్శిస్తున్న శుభప్రద్ పటేల్, సిఐ రాంబాబు

**పెద్దేముల్, నవంబర్ 3, ప్రభాతవార్త:**
వికారాబాద్ జిల్లాలోని కెరెల్లి–బాచారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందగా, ఏడు గురికి గాయాలయ్యాయి. దీంతో గురువారం మృతుల కుటుంబాలను రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్ పగటేల్, తాండూరు రూరల్ సిఐ రాంబాబు పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసుల అదుపులో తీసుకున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన వారిలో టిఆర్ఎస్ మండలపార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్.నారాయన్‌రెడ్డి, మదనంతాపూర్, రెగొండి సర్పంచ్‌లు గోవర్ధన్, హైదర్, రవి నాయక్, మాణ్యానాయక్, రవి రాథోడ్, పాండు నాయక్, సయ్యద్ ఇబ్రాహీం తదితరులు పాల్గొన్నారు.

### నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే



బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

**కొడంగల్ రూరల్, నవంబరు 3 (ప్రభాతవార్త)ః**
పదేళ్ల బాలుడిని హత్య చేసిన నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి, పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ బి.శంకర్‌కు సూచించారు. అక్టోబరు 29న కొడంగల్ పట్టణంలో హత్యకు గురైన బాలుడు రజాఖాన్ కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే పరామర్శించారు. బాలుడిని అతికిరాతకంగా హత్య చేసిన సంఘటనలో అన్నీ కోణాల్లో దర్యాప్తు చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో నిందితుడిని ప్రవేశపెట్టి త్వరలో కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ నేతలు మధుసూదన్‌యాదవ్, ఎండీ.సలీం, ఎస్ఎం.గౌసన్, సయ్యద్ అంజద్, టి.సాయిలు, ఫయిమోద్దీన్, బి.అరుణ్, నరేశ్, అంబేద్కర్ సంఘం నాయకులు యు.రమేశ్‌బాబు తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ వార్డు ఆఫీసర్ల నియామకం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్,తదితరులు

**శంషాబాద్ నవంబర్3,ప్రభాతవార్త :**
శంషాబాద్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షిస్తూ ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మమహేందర్ రెడ్డి,వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్,కమిషనర్ సాబేర్ అలీ తెలిపారు.వార్డుల పరిధిలో జరిగే అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందజేయడం కోసం వార్డు ఆఫీసర్లను నియమించడం జరుగుతుందని ఇందులో భాగంగా గురువారం రెండు,మూడు 16వ.వార్డులో స్థానిక కౌన్సిలర్లతో సమావేశం ఏర్పాటు చేసి వార్డు అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సునీత దయానంద్,బద్రు నాయక్,లక్ష్మీ శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ ఏఈ నరేష్,శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ వెంకటరెడ్డి,ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

### అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న కుండ భానుచందర్

**మేడ్చల్, నవంబర్ 3. ప్రభాతవార్త ః**
అంబేద్కర్ విగ్రహాన్ని విధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మేడ్లచ్ మండల ఎమ్మార్పీఎస్ యువసేన ప్రధాన కారయదర్శి కుండ భానుచందర్ అన్నాడు. జోగులాంబ గద్వాల్ జిల్లా ధారూర్ మండలం రేవులపల్లి గ్రామంలో ఇటీవల అంబేద్కర్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారని వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టకపోతే ఇలాంటి సంఘటనలు పునరావృత్తం అవుతాయని ఆయన అన్నాడు. ఇటీవల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, నవీన్, సాదిక్, వినయ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకుంటాం

-ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

**పెద్దేముల్, నవంబరు 3, ప్రభాతవార్త:**
కెరెల్లి – బాచారం మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్ మండలంలోని మదనంతాపూర్, రెగొండి గ్రామాలలో భాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట పరామర్శించిన వారిలో పెద్దేముల్ ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, రెగొండి సర్పంచ్ హైదర్,మండల టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు డివై నర్సిములు, మాజీ సర్పంచ్ అంజిలయ్య, మంబాపూర్ టిఆర్ఎస్ గ్రామకమిటి యూత్ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



రెగొండిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంఎల్‌సి

# ఇంటి స్థలాలు కేటాయించి... డబుల్ బెడ్ రూంలు నిర్మించండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**కొందుర్గు, నవంబర్ 3, (ప్రభాతవార్త) :**
కొందుర్గులో నిరుపేదలకు ఇచ్చిన ఇంటి పట్టాల ప్రకారం స్థలాలు కేటాయించి అందులో డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి పట్టా పొందిన లబ్ధిదారులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జంగయ్య మాట్లాడుతూ... కొందుర్గు శివారు నుంచి సర్వేనెంబర్ 237 ప్రభుత్వం 70 మందిని అర్హులుగా గుర్తించి ఒక్కొక్కరికి 100 గజాల చొప్పున స్థలాన్ని ఇచ్చినట్లు ఇంటి పట్టాలు ఇచ్చింది కాని ప్లాట్లు చూపించలేదన్నారు. దాంతో చుట్టు ప్రక్కల రైతులు ఆ భూమిని ఆక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆ భూమిని సర్వే చేయించి లబ్ధిదారులకు ఇంటి స్థలాలు చూపించి అందులోనే డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతు తహసీల్దార్ రమేష్‌కు



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు, లబ్ధిదారులు

మార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుద్దుల జంగయ్య, నాయకులు సురేష్, వెంకటేష్, లబ్ధిదారులు మంజుల, బందెమ్మ, యాదమ్మ, బైండ్ల కోరంటి పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ రాకతో తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త జోష్

-జోడో యాత్రలో మండల కాంగ్రెస్ నాయకులు

**మొయినాబాద్, నవంబర్ 3, ప్రభాతవార్త :**
భారత్ జోడో యాత్రతో భారతదేశంలోని నీచపు రాజకీయాలకు చరమగీతం పాడనుందని, రాహుల్ గాంధీ రాకతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నాయకులకు కొత్త జోష్ వచ్చిందని అంటున్నారు, గురువారం మొయినాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు భారత్ జోడో యాత్రలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా గన్నేపాగ నర్సింగ్‌రావు మాట్లాడుతూ...ఏఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు ప్రారంభించిన జోడ యాత్రతో దేశంలోని నీచపు రాజకీయాలు చేస్తున్న పార్టీలకు చెమటలు పాడుతున్నాయని వారు అన్నారు, జోడో యాత్రకు వస్తున్న ప్రజా స్పందన ఇంతా అంతా కాదని మాటల్లో వర్ణించలేమని అన్నారు, దేశంలోని కొన్ని దుర్మార్గమైన శక్తులు దేశంలో కులాలుగా విభజించి మారణ హోమం సృష్టిస్తున్నాయని, మతం పేరుతో, కులం పేరుతో, ప్రాంతం పేరుతో నీచపు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు, ఇలాంటి రాజకీయాలు చేస్తున్న పార్టీలకు రాహుల్ గాంధీ జోడో యాత్రతో చరమగీతం పాడనున్నట్లు తెలిపారు, 2023 లో కాంగ్రెస్ పార్టీ



అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు, కాంగ్రెస్ పార్టీతోనే దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఓబిసి ఉపాధ్యక్షులు నారాయణపురం మహేందర్ ముదిరాజ్, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లం మాణిక్యం రెడ్డి, తలారి భిక్షపతి, ముదిరాజ్ శేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

# నాయకులు గూండాయిజం మానుకోవాలి

-కెసిఆర్ పాలనపై నిప్పులు చేరిగిన బిజెపి నాయకులు

-ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి డౌన్ డౌన్ అంటు నినాదాలు

**బషీరాబాద్,నవంబర్ 3,ప్రభాతవార్త:**
తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను మునుగోడులో రానివ్వకుండా తెరాస నాయకులు, పోలీసులు అడ్డుకున్నారు.వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ ఆదేశాల మేరకు బషీరాబాద్ మండల బిజెపి నాయ కులు గురువారం నాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద కెసిఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ... తెరాస ప్రభుత్వం ఎన్ని కుట్రలు,కుతంత్రాలు చేసినా మునుగోడులో గెలిచేది బిజెపి అని అన్నారు.అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు కులకర్ణి మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం మునుగోడులో ఓటమి భయంతో ఇలాంటి దర్మార్గాలకు ఒడిగడుతుందన్నారు. తెరాస ప్రభుత్వం గుండాయిజం,రౌడీయిజం మానుకోవాలని ప్రభుత్వానికి హెచ్చరించారు.రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి గెలుపు ఖాయం అని అన్నారు.బిజెపి మండల యువమోర్చా అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ తెరాస ప్రభుత్వంలో గుండాగిరి ఎక్కువైందని బిజెపి నాయకులపై కానీ పార్టీ కార్యకర్తలపై కానీ రౌడీయిజం చేయటం సరికాదన్నారు.హూజురాబాద్ లో ఓటమిని చవిచూసిన కెసిఆర్



మునుగోడులో ఓడిపోతున్నట్లు తన సర్వేల్లో వెల్లడి కావటంతో అది జీర్ణించుకోలేక ఈటెల రాజేందర్ పైన,బండి సంజయ్ పైన దాడులకు పాల్పడటం సరి కాదని,కెసిఆర్,కెటిఆర్, రోహిత్ రెడ్డి ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. నవంబర్ 6వ తేదిన కెసిఆర్ ఆట ముగుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శ మహేష్, మండల ఎస్సి మోర్చా అధ్యక్షులు తుల్జప్ప,పార్టీ కార్యకర్తలు అంబ్రెష్,బాలకృష్ణ,శీను తదితరులు ఉన్నారు.

## డబ్బాల తొలగింపు ఓ డ్రామా

**బషీరాబాద్,నవంబర్ 3,ప్రభాతవార్త:**
డబ్బాల తొలగింపు ఓ డ్రామా,ఇదంతా ప్రలోభాల కోసమేనా...? అని స్థానికులు అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.ఎలాంటి అనుమతులు లేకుండా పశువైద్యశాల ముందు,ఆర్ అండ్ బి రోడ్డుకు పక్కనే డబ్బాలను ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందుల పాలవుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.గత శనివారం అధికారులు డబ్బాల తొలగింపు చర్యలు చేపట్టగా స్థానిక నాయకులు అధికారులను అడ్డగించినట్లు విశ్వాసనీయ సమాచారం.ఈ డబ్బాలను అధికారులు తొలగిస్తారా లేక ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఇలాగే ఉంచుతారో చూడాలి.

### చెరువు కట్టపై స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం



**శంషాబాద్ నవంబర్3,ప్రభాతవార్త :**
శంషాబాద్ మండలంలోని చిన్న గోల్కొండ చెరువు కట్టపై స్కూల్ వరకు తృటిలో ప్రమాదం తప్పింది.స్కూల్ బస్సు చెరువు కట్టపై నుండి వస్తుండగా మరో వివానం ఎదురు రావడంతో బస్సును సైడ్‌కు తీసుకోవడానికి డ్రైవర్ ప్రయత్నించాడు.దీనితో ఆ బస్సు చెరువు పక్కకు ఒరిగిపోయింది.దీనిని గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేసి విద్యార్థులు అందరినీ కిందికి దింపారు.డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యార్థులందరూ క్షేమంగా బయటపడ్డారు.ఔటర్ రింగ్ రోడ్డుపై నీరు నిలిచి ఉండిపోవడంతో ఔటర్ రింగ్ రోడ్ ఎక్స్‌టెన్షన్ 15 వద్ద వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.దీనితో అటువైపు నుండి వెళ్లాల్సిన వాహనాలన్ని చిన్న గోల్కొండ చెరువ కట్ట మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి.అసలే ఇరుకుగా ఉండే ఆ కట్టపై నుండి రెండు వైపులా వాహనాలు తిరుగుతుండడంతో కట్ట కూడా ప్రమాదకరంగా మారింది.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఔటర్ రింగ్ రోడ్డుపై నిలిచి ఉన్న నీటిని తొలగించాలని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని స్థానికులు కోరుతున్నారు.

### లంబాడీ హక్కుల పోరాట సమితి నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

**బొంరాస్‌పేట్,నవంబర్3,ప్రభాతవార్త ః** బొంరాస్‌పేట్ మండల పరిధిలోని ఊరేనికితాండలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సూర్య నాయక్ అధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.ఆయన మాట్లాడుతూ...పోడు భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలను ఇవ్వాలి, తాండలను రెవెన్యూ గ్రామాలుగా ఏర్పాటు చేసి అభివృద్ధికి నిధులు ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు అధ్యక్షులు అనిల్‌నాయక్,ఉపాధ్యాక్షులు రాంసింగ్,లోక్యనాయక్,కార్యదర్శి రమేష్‌నాయక్, బాందీబాయి,ప్రధానకార్యదర్శి కిషన్‌నాయక్,రమేష్‌నాయక్,సభ్యులు రతన్‌నాయక్, కిషన్‌నాయక్,గోపాల్‌నాయక్,భీమ్లానాయక్,హరిచందర్‌నాయక్,అరుణ్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### గురుకుల పాఠశాల విద్యార్థులకు అవగాహన

**కొడంగల్,నవంబర్3,ప్రభాతవార్త ః**
కొడంగల్ మహాత్మా జ్యోతీ పూలే గురుకుల పాఠశాల(ఎమ్‌జేపిటీబిసిడబుల్ఆర్)లో ఎస్ఐ రవి,పోలీస్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అందులో ఈవ్ టీజింగ్,ర్యాగింగ్,ఫోక్సో చట్టాల గురించి, మైనర్ డ్రైవింగ్,ట్రిపుల్ రైడింగ్,ట్రాఫిక్ నిబంధనల గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది.అలాగేయువత గుట్కా,మట్కా,గంజాయి,ఆల్కహాల్ వంటి చెడు వ్యసనాలకు బానిసై తమ జీవితాన్ని పాడుచేసుకోవద్దని దాని వలన కుటుంబానికి మరియు సమాజంలో చెడ్డపేరు వస్తుందని అన్నారు. అలాగే మొబైల్ ఫోన్‌లలో ఉండే వాట్సప్,యూటూబ్,ఫేస్‌బుక్ వంటి వాటిని విపరితంగా వాడుతూ ఆనారోగ్యానికి గురికావడం జరుగుతుందన్నారు.ఫోన్‌కు వచ్చేమెసేజ్‌లకు,అనవసరమైన లింక్‌లను క్లిక్‌చేయరాదని, ఓటిపి నంబర్ చేపడం వలన అకౌంట్‌లో ఉన్న డబ్బులను కోల్పోవద్దని అన్నారు.షీ టీం ద్వార విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయబృందం,మహిళా పోలీస్ సిబ్బంది లలిత,మానస తదితరులు పాల్గొన్నారు.

### నిరంతర సాధనతో లక్ష్యం సాధ్యం

-6న చౌడేశ్వరీ మీతా ఆలయం నుంచి 5కే రన్



అభ్యర్థులకు వ్యాయామంపై శిక్షణ ఇస్తున్న ఎస్పై

**కొడంగల్,నవంబర్ 3ప్రభాతవార్త :**
పోలసు కొలువు సాధనను ఓ తపస్సులా భావించి కష్టపడాలని ఎస్పై రవిగౌడ్ అన్నారు.గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోలీసు కానిస్టేబుల్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఎస్పై శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా వ్యాయామం,యోగా,పరుగు తదితర వాటిపై అభ్యర్దులకు శిక్షణ ఇచ్చారు.అలాగే ఈనెల 6న ఆదివారం ఉదయం పట్టణ శివారులోని చౌడేశ్వరీమాతా ఆలయం నుంచి 5కే రన్ నిర్వహించడం జరుగుతుందన్నారు.అభ్యర్దులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### అవినీతి నిర్మూలనపై యుబిఐ అధికారుల అవగాహన



ఎన్ఎఫ్‌సీనగర్ కేంద్రీయ విద్యాలయలో ప్రతిజ్ఞ చేస్తున్న యుబిఐ అధికారులు

**ఘట్‌కేసర్, నవంబర్ 3, ప్రభాతవార్త:** బ్యాంకుల్లో ఋణాల మంజూరుకు సంబంధించి ఏలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకత పాటిస్తున్నామని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిప్యూటి జనరల్ మేనేజర్–సికింద్రాబాద్ రీజినల్ హెడ్ సిఎస్.జనని తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని కేంద్రీయ విద్యాలయలో గురువారం ఘట్‌కేసర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులకు అవినీతి నిర్మూలన, లంఛగొండితనం నిర్మూలనపై అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో అవినీతికి తావులేకుండా సేవలందిస్తామని దేశంలో అవినీతి నివారణకు అందరూ కృషి చేయాలని అధికారులు, టీచర్లు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బ్యాంకుల్లో అధికారులు లంఛాలు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో యుబిఐ డిప్యూటీ రిజీనల్ హెడ్ కెవి.చంద్రశేఖర్‌రావు, చీఫ్ మేనేజర్ కెపి.ఆచారీ, వివేక్, సీనియర్ మేనేజర్ పి.విక్రాంత్, ప్రాంతీయ అధికారి జయ, ఘట్‌కేసర్ బ్రాంచ్ మేనేజర్ రఘు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సిఎం రిలీఫ్ గొప్ప వరం



సీఎం రిలీఫ్ చెక్కును అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

**మేడ్చల్, నవంబర్ 3. ప్రభాతవార్త ః**
ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు గొప్పవరమని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నాడు. మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన లింగంకు రూ 30 వేలు, సిహెచ్ నర్సింహులుకు రూ 22 వేల సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి తన క్యాంపు కార్యాలయంలో అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు గాను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య ఖర్చులు అందుతున్నాయని తెలిపారు. తెలంగాణలో పేదలను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ అందజేస్తున్న పథకాలు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గ దాయకర్‌రెడ్డి, డబిల్‌పూర్ గ్రామ మాజి సర్పంచ్ రాజమల్లారెడ్డి, గౌడవెల్లి మాజి సర్పంచ్ జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఎదగాలి



పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

**షాబాద్, నవంబర్ 3, ప్రభాతవార్త :**
ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఎదిగినిప్పుడే, గ్రామీణ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలరని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సంధ్యనాగరాజు తెలిపారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ ప్రాథమిక పాఠశాలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్‌తో కలిసి ఉచితంగా పుస్తకాలు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ప్లేట్లు, గ్లాసులు, పలకలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా మౌలిక వసతులు ఉన్నప్పుడే వారు విద్యలో రాణించగలరన్నారు. గ్రామీణ ప్రాంతంలోని విద్యాలయాల్లో విద్యార్థులకు అనుగుణంగా మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు తమవంతు కషి చేయాలన్నారు. అలాగే విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని వృద్ధిలోకి రావాలన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, గ్రామస్థులు సత్యనారాయణచారి, శివకుమార్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

### రూ.30లక్షల నిధులతో పోతుగల్ అభివృద్ధి చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి

**షాబాద్, నవంబర్ 3, ప్రభాతవార్త :**
వెనుకబడిన పంచాయతీ అభివృద్ధికి రూ.30లక్షల నిధులు సమకూర్చి పరుస్తామని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి తెలిపారు. గురువారం పోతుగల్ గ్రామంలో ఆయన పర్యటించి గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. పోతుగల్ తాండావాసులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ... పోతుగల్ పంచాయతీకి ఇప్పటికే సుమారు రూ.10లక్షల నిధులు కేటాయించామని తెలిపారు. అలాగే మరో రూ.20లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టే ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వెంటనే రూ.5లక్షల యూజీడీలను ప్రారంభించాలన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, ఆయూబ్‌ఖాన్, మునీర్, సత్యనారాయణ, ఉపసర్పంచ్ రాజు, బిఖ్యానాయక్, యేషాన్, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభలను విజయవంతం చేయండి

-సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

**బొంరాస్‌పేట్,నవంబర్3,ప్రభాతవార్త ః**
మధ్యాహ్న భోజన కార్మికుల ఆల్ ఇండియా మహాసభలను విజయవంతం చేయాలని దుద్యాల్ మండల కేంద్రంలో పోస్టర్‌ను సిఐటీయు నాయకులు బుస్స చంద్రయ్య విడుదల చేశారు.హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 4,5వ తేదిలలో నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల అధ్వర్యంలో పోస్టర్‌ను విడుదల చేయడం జరిగిందన్నారు.ఆల్ ఇండియా మహాసభలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.5వ తేదిన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల గత నిర్ణయాలు,భవిష్యత్ కార్యక్రమాలనిర్ణయాల అమలుపై సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు అయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనకార్మికులు లక్ష్మి,నిర్మల,లలిత తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఎమ్మెల్యే పరామర్శ

**బొంరాస్‌పేట్,నవంబర్3,ప్రభాతవార్త ః**
ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి రోడ్డుప్రమాదంలో గాయపడిన బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు దాసరి నర్సిములు, అనారోగ్యంతో మృతి చెందిన కిష్టపురం అనంతయ్య ఇంటికి వెళ్ళి పరామర్శించారు.ఎమ్మెల్యే నర్సిములుతోపాటుగా అనంతయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని పిల్లల చదువులకు అయ్యే ఖర్చును మొత్తం చెల్లిస్తానని ఎమ్మెల్యే వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల రైతుబంధు అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, ఎంపిటీసి శ్రావణ్‌గౌడ్,ఉపసర్పంచ్ అంజి,యుత్ అధ్యక్షులు మహేందర్, ఎఫ్ఏ సలామ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నాయకున్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పట్నం.